క్లుప్తంగా

పాఠశాల తనిఖీ

పాకాల: తరగతి గదిలో ఉపాధ్యాయుల చేప్పే పాఠాలను బాగా చదవాలని ఎంఈఓ బాబ్జీ తెలిపారు. తద్వారా పాఠ్యాంశాలలోని విషయాలపై పట్టు లభిస్తుందన్నారు. ఆయన శనివారం మల్లెలచెరువు పాఠశాలను తనిఖీ చేశారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం

తిరుపతి కల్చరల్: యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పతంజలి యోగా సమితి అధ్యక్షుడు కైలాష్ సింగ్, లయన్స్ క్లబ్ కార్యదర్శి ఆర్కాట్ కృష్ణప్రసాద్ తెలిపారు. రథ సప్తమి సందర్భంగా శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్, పతంజలి యోగా సమితి సంయుక్తంగా మున్సిపల్ పార్క్‌లో సూర్య నమస్కారాలు, ఆసనాలు వేయించారు.

జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఉపాధ్యాయుడి ఎంపిక

పాకాల: జాతీయ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు యనమలవారిపల్లికి చెందిన ఏ సుబ్రమణ్యం ఎంపికయ్యారు. ఆయన పాకాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇటీవల విజయవాడ దండమూడి స్టేడియంలో జరిగిన అఖిల భారత సివిల్ సర్వీసెస్ రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఈ నెల 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 6 వరకు జరిగే షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆయన పాల్గొననున్నారు.

సత్యనారాయణ స్వామి వ్రతానికి స్పందన

చంద్రగిరి: విజయనగర్ కాలనీలో శనివారం నిర్వహించిన సామూహిక సత్యనారాయణ వ్రతానికి విశేష స్పందన లభించింది. వ్రతాన్ని శ్రీగాయత్రీ సేవా సమితి ఆధ్వర్యంలో సిద్ధార్థ స్కూల్ కరస్పాండెంట్ నవచంద్రబాబు, ప్రిన్సిపాల్ రాములు ఉచితంగా నిర్వహించారు. పట్టణంలోని 108 మంది దంపతులు వ్రతాన్ని ఆచరించారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

చంద్రగిరి: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్వీ వైద్య కళాశాల డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ జయరాములు తెలిపారు. ఎస్వీ వైద్య కళాశాల సామాజిక వైద్య విభాగం, ప్రసూతి ఆస్పత్రి సంయుక్తంగా శనివారం శానంబట్ల గ్రామస్తులకు రొమ్ము, గర్భకోశ ముఖద్వార క్యాన్సర్‌పై అవగాహన కలిగించారు. అనంతరం 125 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు.

అంగరంగ వైభవం

తిరుచానూరు / చంద్రగిరి / రామచంద్రాపురం / భాకరాపేట / పాకాల/ తిరుపతి కల్చరల్: పద్మావతి అమ్మవారు, శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయాలతోపాటు చంద్రగిరి నియోజకవర్గంలోని మండలాలతోపాటు తిరుపతి నగరంలోని పలు ఆలయాల్లో రథ సప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పద్మావతి అమ్మవారు ఒకే రోజు ఏడు వాహనాలను అధిష్టించి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వెంకన్న బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు.



సూర్యప్రభ వాహనంపై పద్మావతి అమ్మవారి కటాక్షం





గరుడ వాహనంపై ఊరేగుతున్న పద్మావతి అమ్మవారు, చిన్నశేష వాహనంపై దర్శనమిస్తున్న అమ్మవారు, అశ్వవాహనంపై అమ్మవారి చిద్విలాసం



తిరుపతి: స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న ప్రసాద్‌రాజు, అర్చకులు



రామచంద్రాపురం: సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న వెంకటేశ్వర స్వామి



చంద్రగిరి: బంగారు తిరుచ్చి వాహనంపై భక్తులకు కటాక్షిస్తున్న కల్యాణ వెంకన్న

అమ్మవారి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి



ఆలయం వెలుపల సీఎస్ జవహర్‌రెడ్డి

తిరుచానూరు: పద్మావతి అమ్మవారిని శనివారం రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కొలగట్ల వీరభద్రస్వామి,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్‌రెడ్డి దర్శించుకున్నారు. జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వాద మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే సీఎస్‌ను ఎస్వీయూ వీసీ రాజారెడ్డి పద్మావతి గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. వర్సిటీలో విద్యా బోధన, పరిశోధనాభివృద్ధిని వివరించారు.

శ్రీరాములు మృతి తీరని లోటు

తిరుపతి మంగళం: తిరుపతి 17వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నల్లాని శ్రీరాములు మృతి పార్టీకి తీరని లోటని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. నల్లాని శ్రీరాములు శనివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న భూమన అభినయ్‌రెడ్డి 17వ వార్డులోని మృతుడి ఇంటికి వెళ్లారు. శ్రీరాములు భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.



శ్రీరాములు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

హాకీ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్‌ను రద్దు చేయండి

చంద్రగిరి: అక్రమాలకు పాల్పడుతూ, క్రీడాకారుల జీవితాలను నాశనం చేస్తున్న హాకీ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ గుర్తింపును రద్దు చేయాలని ఒలింపిక్ అసిసోయేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. ఆయన శనివారం జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవిఎస్.మణితో కలిసి నరసింగాపురం సమీపంలోని హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కొన్ని నకిలీ అసోసియేషన్లు అక్రమాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. వాటిపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఎస్ఏఏపీ) చర్యలు తీసుకోవాలని కోరారు. హాకీ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్‌ను 2014లో రిజిస్ట్రేషన్ చేయించారని, రిజిస్ట్రేషన్‌లో ఉన్నట్టు కాకుండా మరో పేరుతో బ్యాంకు ఖాతాలు తెరిచారని, హర్ష కుమార్ అనే వ్యక్తి కార్యదర్శిగా కొనసాగుతూ పలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు.

గ్యాలరీల్లోని భక్తులకు అన్నప్రసాదాలు

తిరుమల: రథసప్తమి వేడుకలను వీక్షించేందుకు గ్యాలరీల్లో వేచి ఉన్న భక్తులకు టీటీడీ అన్నప్రసాద విభాగం సిబ్బంది నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందించారు. 175 గ్యాలరీల్లో 62 ఫుడ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. అన్నప్రసాద విభాగంలో 240 మంది సిబ్బంది, 130 మంది సులభ్ సిబ్బంది, 800 మంది శ్రీవారి సేవకులు భక్తులకు సేవలందించారు. ఏర్పాట్లను అన్నప్రసాదం డిప్యూటీ ఈవో సెల్వం, ప్రత్యేకాధికారి జీఎల్ఎన్‌శాస్త్రి పర్యవేక్షించారు. అలాగే 1000 మంది పారిశుద్ధ్య సిబ్బంది, 600 మంది శ్రీవారిసేవకులు మాడ వీధుల్లోని గ్యాలరీలు, ఇతర ప్రాంతాల్లో పారిశుద్ధ్యపనులు చేపట్టారు. నాలుగు మాడ వీధుల్లో పోగయిన సుమారు 40 టన్నుల చెత్తను తరలించారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

పాకాల: మహిళలు చిన్నచిన్న సమస్యలకే భయపడి తమ జీవితాలను నాశనం చేసుకోకుండా ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని సీఐ రాజశేఖర్ తెలిపారు. ఆయన శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ సమస్యలు ఎదుర్కొంటున్న యువతులను గుర్తించి మనోధైర్యాన్ని కల్పించాలన్నారు. గ్రామాల్లో పర్యటించి చిన్నచిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని తెలిపారు. ఆత్మహత్యల వల్ల కుటుంబ సభ్యులు పడే బాధను వివరించాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

భాకరాపేట: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో దేవేంద్రబాబు ఆదేశించారు. ఆయన శనివారం అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ చిన్నగొట్టిగల్లు, భాకరాపేట, దీన్‌దార్లపల్లె, చట్టేవారిపాళెం పంచాయతీల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలని అధికారులను కోరారు.

రేపు భరత కళాక్షేత్రం వార్షికోత్సవం

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో సోమవారం భరత కళాక్షేత్రం వార్షికోత్సవం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ ధనశ్రీ తెలిపారు. ఆమె శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. శాస్త్రీయ నృత్య కళలపై చిన్నారుల్లో అభిరుచిని కలిగించేందుకు రెండేళ్ల కొకసారి బుద్ధ జాతకరత్న, పంచతంత్ర కథలతో భరతనాట్య సంప్రదాయా న్ని మేళవించి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆదివారం నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, ఫ్యాన్సీ డ్రెస్, భగవద్గీత శ్లోకాలు, గ్రూప్, సోలో జానపద నృత్యం, సంగీతం వంటి పోటీలు నిర్వహిస్తామన్నారు.

ఎస్వీయూ మహిళా క్రికెట్ జట్టు ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్: మైసూరులోని జేఎస్ఎస్ సైన్స్ అండ్ టెక్నాలజీ వర్సిటీలో 31 నుంచి జరగనున్న దక్షిణ భారత అంతర్ వర్సిటీల క్రికెట్ టోర్నమెంట్‌కు ఎస్వీయూ మహిళా క్రికెట్ జట్టును శనివారం ఎంపిక చేశారు. ఎస్వీయూ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలలకు చెందిన 16 మందితో జట్టును ఎంపిక చేసినట్లు ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం .శివశంకర్‌రెడ్డి తెలిపారు. జట్టు కోచ్‌గా బాబు, మేనేజర్‌గా కె.లక్ష్మీరాజ్యం వ్యవహరించనున్నారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

తిరుపతి అర్బన్: ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని డీపీటీవో చెంగల్‌రెడ్డి తెలిపారు. డీపీటీవో కార్యాలయంలో శనివారం ఆఫీస్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్(ఓఎస్‌డబ్ల్యూఏ) 2023 డైరీని ఆవిష్కరించారు.

అవార్డులు బాధ్యతను పెంచుతాయి

తిరుపతి అర్బన్: అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయని ఏపీ సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవా నంద్ తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న తిరుపతి డివిజన్ వీఆర్వోల సంఘం అధ్యక్షుడు జి.చెంగల్రాయులు ను శనివారం తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సన్మానించారు. సీపీఎస్ ఉద్యోగ సంఘం తిరుపతి కమిటీ ప్రధాన కార్యదర్శి సి.మంజుల, మోహన్‌కృష్ణ, శివకుమార్, జ్ఞానప్రసాద్, జగన్ పాల్గొన్నారు.



చెంగల్రాయల్‌ను సన్మానిస్తున్న ఏపీ సీపీఎస్ ఉద్యోగ సంఘం నేతలు

దేశ భవిష్యత్తు యువతరందే

తిరుచానూరు: దేశ భవిష్యత్తు నిర్ణయించే శక్తి యువతరానిదేనని మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ సభ్యుడు నరసింహ తెలిపారు. ఆయన శనివారం పద్మావతి మహిళా వర్సిటీని సందర్శించారు. పబ్లిక్ పాలసీ అండ్ ఆంత్రోపాలజీ విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం వివిధ విభాగాధిపతులతో సమావేశమై మహిళా సాధికారత, గ్రామీణ మహిళాభివృద్ధికి చేపట్టిన కార్యకలాపాలపై చర్చించారు.

రేపు టీటీడీ ఉద్యోగుల సమావేశం

తిరుపతి కల్చరల్: టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాల విషయంపై సోమవారం స్థానిక ఏడీ బిల్డింగ్‌లోని టీటీడీ క్యాంటీన్ వద్దనున్న విశ్రాంతి ఉద్యోగుల భవనలో సమావేశం నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు.